క్లుప్తంగా

అంగన్‌వాడీ కార్యకర్తల వినతి

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీ కార్యకర్తల, ఆయాల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఉప తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి ఏపీ అంగన్‌వాడీ, హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలిపారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ అయినప్పుడు రూ.5లక్షలు చెల్లించాలని, కనీస వేతనం రూ.28వేలు ఇవ్వాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు విజయ, శివనారాయణమ్మ, రాణిబాయి పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ అగస్త్యేశ్వరాలయంలో సోమవారం శివోహం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. టీటీడీ పాలక మండలి కమిటీ సభ్యుడు టంగుటూరు మారుతి ప్రసాద్ భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి, అల్లుడు లేఖజ్ రెడ్డి, కూతురు కీర్తన ఆధ్వర్యంలో ఈ అన్నప్రసాద కార్యక్రమం జరిగింది.

సేవకులకు ఒకరోజు సదస్సు

ప్రొద్దుటూరు : మండలంలోని అమృతానగర్‌లోని క్రైస్తవ మందిరంలో సోమవారం వైఎస్సార్ కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవకులకు ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య ప్రసంగీకులు కె.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అపోస్తుల బోధ, ఆత్మనియమం, స్వాతంత్ర్యం నిచ్చు సంపూర్ణ నియమం, పరిశుద్ధులకు అప్పగించిన బోధ గురించి వివరించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చీకటి చార్లెస్ మాట్లాడుతూ పాస్టర్లకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, కొత్త చర్చిల రిజిస్ట్రేషన్, గౌరవ వేతనం కోసం కృషి చేస్తానని తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రేమకుమార్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి పెనుబాల ఓబులేసు, సాంబశివయ్య, కోశాధికారి జాకోబు, పాస్టర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో సోమవారం ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు గృహసామాగ్రిని పంపిణీ చేశారు. ఇటీవల వివేకానంద కాలనీకి చెందిన బింగుమళ్ల సరస్వతి అనే మహిళ గృహం షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో రూ.18వేల విలువ చేసే నిత్యావసర వస్తువులు, గృహసామాగ్రి, రూ.2వేలు నగదును ఆమెకు అందచేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సభ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్మశానానికి స్థలం కేటాయించాలి

గోపవరం : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని వల్లెరవారిపల్లె ఎస్సీ కాలనీకి సంబంధించి స్మశానానికి స్థలం కేటాయించాలని సోమవారం డిప్యూటీ తహసీల్దారు విద్యాసాగర్‌కు దళిత పోరాట సమితి నాయకులు వినతి పత్రం అందజేశారు. కాలనీలో 50 కుటుంబాలు ఎస్సీలు ఉన్నప్పటికీ ఇంత వరకు స్మశానస్థలం కేటాయించకపోవడం దారుణమని, ఎవరైనా చనిపోతే ఎక్కడ ఖననం చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన డీటీ విద్యాసాగర్ ఎస్సీకాలనీకి స్మశానస్థలం కేటాయించాలని ఇటీవల ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని, ఆ మేరకు పరిశీలించి త్వరలోనే స్థలం కేటాయిస్తామని ఆయన తెలిపారు.

సామాజిక రుగ్మతలకు ఔషధం వేమన పద్యాలు

కాశినాయన : సామాజిక రుగ్మతలకు ఔషధం వేమన పద్యాలని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.వి. సుభాషిణి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డిలు అన్నారు. సోమవారం పాఠశాలలో వేమన ఫౌండేషన్ అనంతపురం నిర్వాహకుడు అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఆర్థిక సహాయంతో వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమన పద్యాలు సమాజాన్ని చైతన్యపరిచేందుకు ఎంతో ఉపయోగపడతాయని కొనియాడారు. వేమన సాంఘిక సంస్కర్తగా సమాజ మార్పునకు ఆయన పద్యాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం వేమన పద్య పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

బద్వేలు అర్బన్ : వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎల్ఐపీ కోర్సు డైరెక్టర్ జి.వి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం బద్వేలు, గోపవరం, బి.కోడూరు మండలాల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, తెలుగు, ఆంగ్ల భాషోపాధ్యాయులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాబోవు ఫైనల్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని చదువులో వెనుకబడిన విద్యార్థులో అభ్యసనాభివృద్ధిని పెంచాలని వారు కోరారు. మంగళవారం ఉదయం గణితం, సాంఘికశాస్త్రం, మధ్యాహ్నం జీవ, భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గోపవరం ఎంఈఓ చెన్నయ్య, డీఆర్పీలు పైడి నాగసుబ్బయ్య, సత్యానందరెడ్డి, సి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అక్రమంగా పొందిన పట్టాలు రద్దు చేస్తాం
- అసైన్‌మెంట్ కమిటీలో అర్హులకు కేటాయిస్తాం
- ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని కూనవారిపల్లె పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పిచ్చిపాటిపల్లె, ఎస్సీకాలనీ, సీతానగరం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాల లబ్ధిని ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. లబ్ధిదారులు ఎంతో సంతోషంతో అన్ని పథకాలు అందుతున్నాయి..సీఎం జగన్ మేలును ఎన్నటికీ మరువలేమని ఎమ్మెల్యే ఎదుట వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో అక్రమంగా ఎలాంటి అసైన్‌మెంట్ కమిటీ అనుమతులు లేకుండా పట్టాలు ఇచ్చారన్నారు. వారందరికీ నోటీలు ఇచ్చినట్లు చెప్పారు. అక్రమంగా పట్టాలు పొందిన వాటిని తొలగించి త్వరలో అసైన్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. అర్హలందరికీ ఇంటి పట్టాలు ఇస్తామన్నారు. మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డిది రెండునాల్కల ధోరణ అన్నారు. గతంలో విశాఖపట్టణం రాజధానిని డీఎల్ సమర్థించారన్నారు. నేడు అమరావతికి రాజధాని అంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కరీముల్లా, మండల వైఎస్సార్‌సీసీ కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, ఎంపీటీసీ బి.రాముడు, నాయకులు గంగాధర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, కొత్తపేట ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, అంజనేయ కొట్టాలు సర్పంచ్ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ శుద్ధ జలం అందించడమే లక్ష్యం

మైదుకూరు : మున్సిపాలిటీలోని ప్రజలందరికీ శుద్ధి చేసిన తాగునీటిని అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.40 లక్షలతో చేపట్టిన పైపులైన్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుగంగ రిజర్వాయరు నుంచి మున్సిపాలిటీ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం రూ.132 కోట్లతో ట్యాంకులు, నీటి శుద్ధి చేసే ప్లాంట్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. పథకంలో పైపులైన్ నిర్మాణానికి రూ.32 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాగా ప్రధాన పైపులైన్ నుంచి ఇందిరమ్మకాలనీలోని ట్యాంకు వరకు రూ.6.40 లక్షలతో లింక్ పైపులైన్ వేస్తున్నట్లు చెప్పారు. ఈ బృహత్తర నీటి పథకాన్ని త్వరగా పూర్తి చేసి పుర ప్రజలకు శుద్ధి జలాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ రాముడు, ఏఈ నిరంజన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ షాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మున్సిపల్ వైస్‌చైర్మన్ షరీఫ్, కూశెట్టి రాయుడు, మార్కెట్ రవి, బీఎల్ రఘురామయ్య, గౌస్‌లాజం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని ఆశీర్వదిస్తున్న బిషప్ గాలిబాలి

చర్చి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

మైదుకూరు : మండలంలోని జాండ్లవరం వద్ద కొత్తగా నిర్మించిన సెయింట్ జోసెప్ చర్చి ప్రారంభోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన 25 అడుగుల ఏసు క్రీస్తు విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చర్చిని ప్రారంభించిన బిషప్ గాలిబాలి దేవుని వాక్యములను వినిపించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని ఆశీర్వదించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ థామస్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన

చాపాడు : స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జవహర్ మున్నీర్ మాట్లాడుతూ బాలికలకు తప్పనిసరిగా చదువు నేర్పించాలన్నారు. ప్రస్తుతం అన్ని రకాలైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని రంగాలలో బాలికలు ముందంజలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, లక్ష్మీపేట, కేతవరం, వీరభద్రాపురం అంగన్వాడీ కేంద్రాల వర్కర్లు, మహిళా పోలీసులు, సచివాలయ ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ తదితరులు పాల్గొన్నారు.

తృణధాన్యాలను సాగు చేయాలి

కలసపాడు : మండలంలోని రైతులు తృణధాన్యాల పంటలను విస్తారంగా సాగు చేయాలని పోరుమామిళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.మురళీధర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎం.సురేష్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం మండలంలోని చెన్నుపల్లె రైతుభరోసా కేంద్రం పరిధిలో ప్రపంచ తృణధాన్యాల సంవత్సరం 2023ను పురస్కరించుకుని వచ్చే ఖరీఫ్ సీజన్‌లో 100 హెక్టార్లు (250 ఎకరాలు) తగ్గకుండా సజ్జ పంట సాగు చేసే రైతులను ఒక సమూహంగా ఏర్పాటు చేసి తృణధాన్యాల వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాల గురించి వారు రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం, నేతాజీ సోషియల్ క్లబ్ సభ్యులు

ప్రొద్దుటూరు : నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక కోర్టు ఎదురుగా ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం, నేతాజీ సోషియల్ క్లబ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆజాద్ హిందు ఫౌజ్‌ను స్థాపించి బ్రిటిష్ పాలకులతో పోరాడి స్వాతంత్ర్యాన్ని ప్రకటించిన జాతీయ ఉద్యమ నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మనమందరం సమాజ సేవలో పాల్గొనాలని తెలిపారు. రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైవీ స్వరూప్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు, టీటీడీ బోర్డు మెంబర్ టంగుటూరు మారుతిప్రసాద్, సమన్వయకర్తలు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి కోటా ఓబుళరెడ్డి, శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ముడిమెల కొండారెడ్డి, పద్మవీరన్న, యడవల్లి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, కమిషనర్ వెంకటరమణయ్య ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వారు రూపొందించిన 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం నాయకులు మస్తాన్, శ్రీనివాసులు, రాజకుళాయరెడ్డి, రఫిబాషా, అపర్ణ, మౌనిక, రాజు, ప్రసాద్, వై.మహేష్, రామలింగం, వేణు, సురేష్, సాయి, శంకర్, వి.శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థులకు అవగాహన సదస్సు

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కాలేజీలో సోమవారం ఎంబీఏ విద్యార్థులకు ఏఐఎంఎస్ అసెస్మెంట్ ఇండియన్ మేనేజ్‌మెంట్ స్కూల్స్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎయిమ్స్ ట్రెజరర్ నరసింహారావు మాట్లాడుతూ.. నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసి 2020 ప్రకారం విద్యా బోధన చేయడం ముఖ్యమని తెలిపారు. బిజినెస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ బిజినెస్ స్కూల్ ఆఫ్ డేటా సైన్స్ బిజినెస్ స్కూల్ ఆఫ్ ఈవేంట్ కోర్సులను స్కూల్స్‌లో రూపొందించాలన్నారు. విద్యార్థులకు చాయిస్ ఆఫ్ ఎడ్యుకేషన్ అనేది సులభంగా ఉంటుందన్నారు. విద్యార్థులు స్కిల్స్, ఆటిట్యూడ్, నాలెడ్జ్ డెవలప్ చేసుకుని తమ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

మైదుకూరు : మైదుకూరు మండలం ఓబులాపురంలో సోమవారం ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలకు చెందిన పశువైద్య నిపుణుల బృందం, జూనియర్ డాక్టర్లు నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జాతీయ సేవా పథకం కింద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 15 పశువులకు గర్భకోశ వ్యాధులకు వైద్య నిపుణులు చికిత్స చేశారు. 12 పశువులకు చూడి పరీక్షలు, కొన్నిటికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. పశు వైద్యులు ఆర్.సుధాకర్, గురివిరెడ్డి, జతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ పి.కళ్యాణి, సాయిదిలీప్ గుప్త, క్లినికల్ విభాగం ఆచార్యులు ఎం.భార్గవి, ఎం.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రాచమల్లు



రాజుపాళెం: టంగుటూరులో సంక్షేమ బాహుటాను అందజేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : గ్రామంలో నెలకొని ఉన్న తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని టంగుటూరు గ్రామంలో గ్రామ వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకొని జగనన్న ప్రభుత్వంలో ఏమేరకు లబ్ధి చేకూరిందో వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం నుంచి రూ.కోటి ఇరవై లక్షలు నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. త్వరలో అందుకు సంబంధించి పనులను కూడా ప్రారంభిస్తామన్నారు. అలాగే ఇళ్లు, పింఛన్లు, సీసీ రోడ్లు, మురికి కాలువలు వేయాలని ఎమ్మెల్యేను పలువురు అడుగగా వేస్తామని తెలిపారు. సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి, గోనా రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహా రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ మారుతీ ప్రసాద్, కామిశెట్టి బాబు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ జ్ఞానానందం, ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు టంగుటూరులో గడపగడపకు మన ప్రభుత్వం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతమ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేతాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

సాంఘికశాస్త్ర ప్రతిభా పరీక్షకు విశేష స్పందన

ప్రొద్దుటూరు కల్చరల్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కడప ఉపవిద్యాశాఖాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణాలయంలో నేతాజీ సోషియల్ స్టడీస్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థులకు సోమవారం సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి భవిష్యత్తుకు బాట వేసుకోవాలన్నారు. సోషియల్ స్టడీస్ క్లబ్ వారు 10 ఏళ్లుగా సాంఘికశాస్త్ర ప్రతిభా పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. డీసీఈబీ సెక్రటరి శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సాంఘిక శాస్త్రం అన్ని శాస్త్రాలకంటే విశిష్టమైనదని ఇలాంటి పరీక్షల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. నేతాజీ సోషియల్ స్టడీస్ క్లబ్ కన్వీనర్ భాస్కర్‌రావు, అధ్యక్షుడు నాగరాజారావు మాట్లాడారు. ఈ పరీక్షకు జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 200 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు మీడియంలో ప్రథమ స్థానంలో గురు కార్తీక్ (జెడ్పీహెచ్ఎస్, గంగిరెడ్డిపల్లె), ద్వితీయ స్థానంలో బాలవర్ధన్ (జెడ్పీహెచ్ఎస్, అంకాలమ్మగూడూరు), తృతీయ స్థానంలో నిథిన్ కుమార్‌రెడ్డి (జెడ్పీహెచ్ఎస్, బ్రాహ్మణపల్లె), ఇంగ్లిషు మీడియం ప్రథమ స్థానంలో జి.సాయితేజ ప్రవల్లిక (జెడ్పీహెచ్ఎస్, హిమకుంట్ల), ద్వితీయ స్థానంలో వహిత (జెడ్పీహెచ్ఎస్, హిమకుంట్ల), తృతీయ స్థానంలో హఫీజున్ (జెడ్పీహెచ్ఎస్, నందిమండలం), గౌరీదీప(జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ జమ్మలమడుగు) నిలిచారు. వీరితోపాటు రెండు మీడియాల్లో 10 కన్సోలేషన్ బహుమతులు అందించారు.

పీఏసీఎస్‌లు లాభాల బాటలోకి రావాలి

ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి



మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్) లాభాల బాటలోకి రావాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని డీసీసీ బ్యాంకు ఆవరణలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం బ్రాంచిల పరిధిలోని పీఏసీఎస్ సీఈఓలు, సూపర్‌వైజర్లు, బ్రాంచి మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల బలోపేతానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృఢమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. అందులో భాగంగానే పీఏసీఎస్‌లకు ఎంఎస్‌సీలో భాగంగా నాబార్డు సౌజన్యంతో 4 శాతం వడ్డీకి ఏ వ్యాపారం చేయడానికైనా లోన్ అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పీఏసీఎస్‌లు లాభాలబాటలోకి రావాలని తెలిపారు. నష్టాల్లో ఉన్న కడప డీసీసీ బ్యాంకు ఇప్పుడు లాభాలా బాటలో ఉందన్నారు. సహకార వ్యవస్థపై రైతులకు, ప్రజలకు నమ్మకం పెంచాలని కోరారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కడప డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సంకల్పం ఉంటే ఎంతటి కష్టాన్ని, నష్టాన్ని అయినా ఎదుర్కోవచ్చన్నారు. నాబార్డు డీడీఎం మాట్లాడుతూ పీఏసీఎస్‌లను లాభాల్లోకి తెచ్చేందుకు సీఈఓలు ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ల సీఈఓలు, బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

వాహనాలను వేగంగా నడపడం ప్రమాదకరం



మాట్లాడుతున్న యుగంధర్

ప్రొద్దుటూరు క్రైం : వాహనాలను వేగంగా నడపడం ప్రమాదకరమని సీనియర్ ఎంవీఐ నారాయణనాయక్ తెలిపారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎస్ఆర్ఐటీ కాలేజీలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. వాహనాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు రహదారి పక్కన ఏర్పాటు చేసిన సూచికలను గమనించాలని సూచించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ట్రాఫిక్‌రూల్స్‌ను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ సీఐ యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను వేగంగా నడపరాదని, ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

హెల్మెట్ ధరించండి..

బద్వేలు అర్బన్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి నిండు జీవితాన్ని కాపాడుకోవాలని బద్వేలు అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు, ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావులు పేర్కొన్నారు. భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఎంవీఐ కార్యాలయం నుండి సిద్దవటం రోడ్డు, మైదుకూరు రోడ్డు, నెల్లూరు రోడ్డుల మీదుగా పట్టణంలో హెల్మెట్‌లు ధరించి బైక్‌ర్యాలీ నిర్వహించారు. వాహనాన్ని అతివేగంగా నడపరాదని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

లిప్ ప్రోగ్రాంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

డీఆర్పీ తిరుమల కొండు

చాపాడు : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన లిప్ కార్యక్రమంపై సోమవారం స్థానిక మండల రీసోర్స్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రీసోర్స్ పర్సన్ తిరుమల కొండు మాట్లాడుతూ.. 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు గత డిసెంబర్‌లో ప్రాక్టీస్ టెస్ట్ మార్క్స్ రిజిస్టర్‌లో నమోదు చేసి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్స్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. టీచింగ్ పీరియడ్, ప్రాక్టీస్ పీరియడ్‌ల ప్రకారం బోధనను ఉన్నతాధికారులు పరిశీలిస్తారన్నారు. ఎల్ఐపీ గ్రేడింగ్ ప్రకారం విద్యార్థులను ఏ, బీ, సీలుగా గుర్తించి వెనకబడిన సీ గ్రేడ్ విద్యార్థుల ప్రగతికి చర్యలు తీసుకోవాలన్నారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, హెచ్చింపు, భాగహారం, తెలుగు, ఇంగ్లీషులో చదవడం, రాయడం, పదాలు గుర్తించడం, కీలక పదాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు మైండ్ మ్యాపింగ్ చేయాలన్నారు. విద్యార్థి స్థాయికి అనుగుణంగా విద్యా బోధన జరగాలన్నారు.

లోక పావనీ.. జగజ్జననీ

- ఘనంగా చండీ హోమం
- భక్తిశ్రద్ధలతో శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవం



వజ్రపు కిరీట ధారణ, పుష్పాభిషేకంలో వాసవీమాత

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో సోమవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ మొదలుకొని అమ్మవారికి విశేషంగా గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, పంచామృతాభిషేకం, మంత్రపుష్పం పూజా కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు చేసి వజ్ర కిరీటంతో అలంకరించారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య కన్యకలు వివిధ రకాల పూలతో నింపిన 102 గంపలను తీసుకొని పురవీధుల్లో వాసవి మాత నామస్మరణల మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆత్మార్పణ చేసుకున్న దినాన్ని సోమవారం ఆర్యవైశ్యులు వైభవంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి మహిళలు 108 కలశాలతో బ్యాండు మేళాలతో పట్టణ ప్రధాన రహదారి గుండా ఊరేగింపు నిర్వహించారు.

కలసపాడు : మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

బీసీల ఆత్మగౌరవం పెంచిన ముఖ్యమంత్రి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీల ఆత్మగౌరవం పెంచి బీసీల పక్షపాతిగా నిలిచారని సగర, ఉప్పర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంట రమణమ్మ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకులు బంగారు శీనయ్యలు పేర్కొన్నారు. సగర, ఉప్పర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవీ కాలాన్ని పొడిగించిన నేపథ్యంలో సోమవారం స్థానిక 6వ వార్డులోని పూలబావివీధిలో గల వెంగమ్మ ఆలయం వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్‌లెస్టై కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ పశ్చిమ కన్వీనర్ యద్దారెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని వికాస్‌విహార్ మానసిక దివ్యాంగ పాఠశాలలో సోమవారం శ్రీకాళేశ్వర కాలనీకి చెందిన మాజీ సైనికుడు సుబ్బరాయుడు యాదవ్ తన తండ్రి పెద్ద వీరయ్య వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పండ్లు, మినీ టవళ్లను అందచేశారు.జయలక్ష్మి, కుటుంబీకులు నాగేశ్ యాదవ్, జయమ్మ, ఝాన్సి పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహ సారథుల ఎంపికలో ప్రొద్దుటూరు టాప్



కన్వీనర్లు, గృహ సారథుల నివేదికను చల్లా మధుసూదన్‌రెడ్డికి అందిస్తున్న పోలా శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు : జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహ సారథుల ఎంపికలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ప్రథమ స్థానం దక్కింది. నియోజకవర్గ పరిధిలోని 82 సచివాలయాలకు సంబంధించిన కన్వీనర్లు, గృహ సారథులను ఎంపిక చేయడంతోపాటు వీరితో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్లు, గృహ సారథులకు సంబంధించి తయారు చేసిన నివేదికను ఎన్నికల పరిశీలకుడు, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డికి అందించారు. ఆయన సోమవారం జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల రాష్ట్ర సమన్వయకర్త-5 చల్లా మధుసూదన్‌రెడ్డికి తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోనే ముందుగా కన్వీనర్లను, గృహ సారథులను ఎంపిక చేసి సమావేశం నిర్వహించినందుకు చల్లా మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, పరిశీలకుడు పోలా శ్రీనివాసులరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

సమస్యల పరిష్కారం కోసమే స్పందన

గోపవరం : సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు పేర్కొన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు అక్కడే అర్జీలు ఇస్తున్నారని, దీంతో మండలస్థాయిలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి పెద్దగా ప్రజలు రావడం లేదన్నారు. సమస్య ఏదైనా ఎక్కడైనా అర్జీ ఇచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, ఏఓ అరవింద నాయక్, డీటీ విద్యాసాగర్, ఈఓపీఆర్డీ హసీనా తదితరులు పాల్గొన్నారు.